20052024-MAI-04_Layout 1 5/20/2024 3:28 AM Page 1



తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com




## అడుగులు పడుతున్నాయి

విశాల విశ్వంలో విశేషాలెన్నో
అనంతమైన అవకాశాలు కూడా ఎన్నో
అందుకోవాలని అంతరంగాన
మార్గం తెలియదు, గమ్యం మదిలోన!

ఎప్పుడూ ఒడ్డున
నత్త గువ్వలు ఏరుకుంటూ ఉంటే
సముద్ర గర్భాన
రత్న రాశులు తాకేదెన్నడు!

ఆశల పతంగీలు ఆకాశాన
నేను నేలపైన చేతిలో దారంతో
నేనెగిరే రెక్కలు
ఎప్పుడు పుట్టుకస్తాయో!

తృష్ణ కృష్ణా నదంత
ఆలోచన ఆకాశమంత
ప్రయత్నము ప్రతినిత్యమూ
ఫలితము ఇంకా పిసరంతే!

సమయం ఇంకా రాలేదా
ఆరంభమే ఆలస్యమైనదా
చరిత్రలో పాఠకుడిగానే మిగిలిపోవాలా
నాకంటూ ఓ చరిత్ర లిఖించలేనా!

అడుగులు పడుతున్నాయి
నా గమ్యం చేరే దారేదో?!



జగ్గయ్య.జి
98495 25802


# కాళిదాసు తొలి కృతి రుతుసంహారం

**కవికుల తిలకుడు, సదా కవి యువ రాజైన కాళిదాసు తొలికృతి 'ఋతుసంహారం' (ఋతువుల మాల). ఈ లఘు కావ్యంలో ఏ కథా లేదు. ప్రియుడు ప్రేయసికి ఆరు ఋతువుల వర్ణన వినిపించడం ఉంది. దీనిలో రాజు ప్రసక్తి, రాజ్య వైభవాల వర్ణనలు లేకపోవడం వల్ల ఇది కాళిదాసు తొలికృతి అని నిస్సంశయంగా చెప్పవచ్చు.**

> **ఈ కృతి కఠినంగా లేకపోవడంతో మల్లినాథ సూరి దీనికి వ్యాఖ్య రాయలేదంటారు. ఆ తర్వాత చాలా ఏండ్లవరకూ ఎవరూ వ్యాఖ్య రాయలేదు. క్రీ.శ.1814లో మణిరామశర్మ అనే పండితుడు ఈ కృతికి చంద్రిక పేరుతో వ్యాఖ్యను రాశాడు. తెలుగులో మాత్రం 2015లో రావి మోహనరావు అద్భుత వ్యాఖ్యను రాశారు. పాశ్చాత్య సాహిత్య పండితులు ఈ కృతిని భారతీయ సాహిత్య భాండాగారంలో ఒక అపూర్వ కృతిగా తలచారు. ఇందులో ఆ కాలపు ఆర్థికస్థితి, ప్రజా జీవనమూ చక్కగా ప్రతిబింబించాయి.**

కాల ఋతుచక్రంలో తొలుత వచ్చేది వసంత ఋతువు. అందుకే 'ఋతురాజో వసన్తః' అనీ అంటారు. కానీ తీవ్రమైన ఎండలతో ప్రకృతినీ, ప్రజలనూ మండించే గ్రీష్మ ఋతువుపై కవికాళిదాసుకు మక్కువ ఎందుకోగానీ.. 'ప్రచణ్డ సూర్యః స్పృహణీయ చన్ద్రమా.. (ప్రేయసీ! చండ ప్రచండ మార్తాండుడు స్వైరవిహారం చేస్తూ ఉండే చల్లని వెన్నెళ్ళు కురిపించే చంద్రుడి రాక కోసం, జనం ఎంతగానో కోరుకుంటూ ఉంటే, స్నానం చేయడానికి మాత్రమే నీళ్లు దొరుకుతూ ఉండే, ఉల్లాస మనోజ్ఞ సాయంత్రాలతో కామోపశమనం చేసే గ్రీష్మం వచ్చేసింది- 'మదీయానువాదం') అంటూ ఈ కృతిరచనను ప్రారంభించాడు. కాళిదాసు తన 'అభిజ్ఞాన శాకుంతలం' నాటకంలోని నాందీ ప్రస్తావనలోనూ అనుభవించేందుకు తగినట్టి గ్రీష్మ ఋతువు గురించే నటిని పాడుమని సూత్రధారుడిచే చెప్పిస్తూ ఆ నటితో 'తలస్నానాలకు చాలా అనుకూలాలై, పాటల పుష్ప సంపర్క పరిమళాల వన వాయువులతో కూడి, చల్లని చెట్ల నీడల్లో సుఖనిద్రను కలిగిస్తూ ఈ గ్రీష్మదినాలు సాయం కాలాల్లో ప్రీతిని కలిగిస్తున్నాయి అనే భావం గల 'సుభగ సవిలావగా హాః దివసా పరిణామ రమణీయః' శ్లోకాన్ని పాడిస్తాడు. ఆరు సర్గల ఈ ఖండ కావ్యంలో ఒక్కో సర్గలో ఒక్కో ఋతువును వర్ణించాడు. ఇందులో మొత్తం 144 శ్లోకాలున్నాయి.

ప్రథమ సర్గ- 'గ్రీష్మ వర్ణనం'లో జనులు- శశాంకుడు వెన్నెలతో తరిమేసిన తమోరాశుల రాత్రులనూ, జలయంత్రాలు గల నివాస సదనాలనూ, చందన సుగంధ ద్రవ్యాలనూ గ్రీష్మంలో తమ తాపహరణానికి వాడుకుంటున్నారనీ, స్త్రీలు సన్నని వస్త్రాలను పైటగా కప్పుకుంటున్నారని వర్ణిస్తాడు. వన హరిణాలు ఎండకు దాహంతో తపిస్తూ దిగంతాకాశాన్ని చూసి నీళ్లేనని పరుగులు తీస్తున్నాయంటాడు. గ్రీష్మతాపానికి సర్పం నెమలిపింఛం నీడన అలసట తీర్చుకుంటుందనీ, సింహం-చేరువలో ఉన్న ఏనుగులను సంహరించడం లేదనీ అంటూ- నిర్జలమవుతున్న నీటి మడుగులతో అడవి భూములు భయాన్ని పుట్టిస్తున్నాయనీ, దావాగ్ని కీలలతో అరణ్యాలు దగ్ధమైపోయాయనీ వేసవి ప్రతాపాన్ని వర్ణించాడు కాళిదాసు.



ద్వితీయసర్గ- 'ప్రావృడ్వర్ణనం' (వర్ష ఋతువర్ణనం)లో కాళిదాసు-మేఘాల మత్తగజాలతో, సౌదామినుల పతాకాలతో, ఉరుములనే మద్దెలలతో వర్షఋతువు రాజువలె రాజసంగా వచ్చిందని వర్ణిస్తాడు. ఈ కాలంలో ధరిత్రి-రత్న మాణిక్యాలతో అలంకృతమై మహా సుందరాంగన వలె భాసిస్తూందంటాడు. ఈ కాలం నవ కుసుమాలతో, అటవి మొల్లమొగ్గలతో, కడిమి పూలతో కర్ణభూషణాలను సంతరిస్తున్నదనీ, ఈ ఋతువు- నీకు హితవు చేకూర్చే నీ కోరికలను మళ్లీ మళ్లీ మరీ మరీ ఫలింపజేయుగాక- అని ఆశిస్తాడు కాళిదాసు.

తృతీయ సర్గ- 'శరద్వర్ణనం'లో శరదృతువు-దర్భతృణవస్త్రాన్ని ధరించి, కమల మనోహరముఖంతో, మరాళ రవళుల మంజుల మంజీర నాదాలతో, కొంచెం పండిన వరి పైరుతో సుందర సుకుమారంగా కడు రమణీయమై కొత్త పెండ్లి కూతురు వలె వచ్చిందని వర్ణిస్తాడు. ఈ కాలంలో నదులు చేపల పేటల వొడ్డాణాలతో, తెల్లని పక్షుల పంక్తుల కంఠహారాలతో సమదంగా మందంగా సాగే ప్రమదల వలె ప్రవహిస్తున్నాయని చెప్తాడు. పద్మముఖంతో నల్లకలువల కళ్లతో రెల్లు పూల తెల్లని వస్త్రంతో శరదృతువుల- మత్తకామినీ కాంత వలె అత్యుత్తమ ప్రీతిని కూర్చాలని కోరుకుంటాడు.

చతుర్థ సర్గ- 'హేమంత వర్ణనం'లో క్రొత్త చిగురుల ఆవిర్భావంతో, సస్యరమల రమ్యతతో, తెల్లని లొద్దుగు చెట్లతో, చిక్కని మంచుతో- మార్గశిర పుష్యమాస సంగమమై చలితో వణికించే హేమంతం వచ్చిందనీ వర్ణిస్తూ, బహు గుణగణాలతో అతిమనోహరమై స్త్రీ జన హృదయాలను దోచుకుంటూ పుష్కలంగా పండిన వరి పంటల పల్లె సీమలు కలదై, ఈ శీత తుషార హేమంతకాలం సౌఖ్యాన్ని ప్రసాదించినదవుగాక- అని ఆశిస్తాడు కవి కాళిదాసు.

> **పంచమసర్గ- 'శిశిరవర్ణనం'లో ఓ ఉవిదా! బాగా పెరిగిన వరి వెన్నులతో మనోజ్ఞమైనదైన, ప్రమద జనానికి చాలా చాలా ప్రియమైన శిశిర ఋతువు గురించి చెప్తున్నా వినుమంటాడు. ఇందులో రెక్కలు మూసిన గవాక్షాల నివాసాల గురించీ, నులి వెచ్చదనాల సూర్యుడి కిరణాల గురించి వర్ణిస్తూ- మిక్కిలిగా బహు గుడ భేదాలు కలిగిన, రుచ్యవరితో, చెరకుతో రమ్య మధురమైన, మదనుడి దర్ప ప్రదర్శన కలిగిన ఈ శిశిర ఋతువు ఎప్పుడూ మీకు శ్రేయస్సును కలిగించేదై ఉండుగాక- అనీ కవి కాళిదాసు కోరుకుంటాడు.**

షష్ఠసర్గ- 'వసంత వర్ణనం'లో ఓ ప్రియురాలా! ఎదిగి పూచిన మామిడి మొలకలే నిశి బాణాలుగా కలిగిన, తుమ్మెదల పంక్తి హారం వింటినారిగా విలసిల్లుతూ ఉండగా మదనుడు నివసించే, జనులను సుఖప్రదమయ్యే వసంత ఋతువనే యోధుడు నిరత సురత కామాసక్తుల మనస్సులను వేధించడానికి వచ్చినాడు సుమా! అని చెప్తాడు. ఈ ఋతువులలో పవనాలు పరిమళభరితాలై, ఆహ్లాద మలిసంజ కెంజాయ వేళలతో దిన సమయాలు రమ్యమై సకలం అతి సుందరంగా ఉంటుందంటాడు. 'ఆమ్రీ మంజుల మంజరీ వరశరః' (ఎవ్వనికి ఆమ్ర సుమ వల్లరి వరిష్ఠమైన బాణమో, ఎవ్వనికి ఎర్రని మోదుగు పూవు ఉత్తమమైన ధనువో, ఎవ్వనికి తుమ్మెదల కులము మేలైన అల్లెత్రాడో, ఎవ్వనికి మలయ మారుతమే మదగజమో, ఎవ్వనికి కోకిలలు కైవారులో, ఆ జిత స్వభావ మన్మథుడు వసంతునితో కలిసి మీకు శుభాల కూర్చుగాక! ) అనే శ్లోకంతో కాళిదాసు 'ఋతుసంహారః' కృతిని సంపూర్ణం చేశాడు.

**అనువాదాలు: ఈ వర్ణనాత్మక 'ఋతుసంహారః' ఖండ కావ్యానికి భారతీయ భాషల్లో పలు అనువాదాలు వచ్చాయి. ఈ కృతి లాటిన్, ఇంగ్లీష్, జర్మన్ మున్నగు యూరోపియన్ భాషల్లోకి అనువాదమైంది. ఈ 'ఋతుసంహారః'కు నాకు తెలిసీ తెలుగులో 1950 ప్రాంతంలో కవి గొట్టుముక్కల రాధాకృష్ణరావు తేట తెలుగు పద్యాలలో అనువాదం చేశారు. 2003లో ప్రముఖ సంస్కృత పండితులు జీవీఎస్ సుబ్రహ్మణ్యశర్మ ఈ 'ఋతు సంహారః'కు తెలుగులో గద్య కవితగా అనువాదం చేశారు. అనువాదరంగంలో ఔత్సాహికుడైన ఈ వ్యాసకర్త వచన కవితా రూపంలోకి అనువదించాడు. సంస్కృత సాహిత్య సంవిధాన రూపకర్తా, నిత్యనూతన కవిత్వ సృష్టికర్తా, కవికుల గురువూ మహాకవి కాళిదాసుకు ప్రణామ సహస్రాలు!!**



'రఘువర్మ' (టీయల్యన్)
92900 93933

# నిర్మల్ శతక కవి వీరయ్య

**మే 23న శత జయంతి**

దైవభక్తి; తమకు తెలిసిన, తమ కాలంలో సుస్థిరమైన నైతిక విలువలను నలుగురితో పంచుకోవడంలో ఉన్న తృప్తి; ఈజోడు నడచిన తోవగ మిగిలిన ఆత్మ సంతృప్తి ఇవే ప్రధానంగా సాధారణ కవులను శతక కవులుగా మలిచి ఉంటాయి. అలాంటి కోవకు చెందినవారే ఉత్తర తెలంగాణ ప్రాంతం నిర్మల్ నివాసి మడిపల్లి వీరయ్య. విస్మృత కవిగా పేర్కొనే కన్నా పేరుపై పెద్దగా ఆశ లేని, దైవ చింతనే పరమావధిగా తలచిన కవులలో ఒకరిగా ఇలాంటి వారిని పేర్కొనవచ్చు. ఇది వీరి శతజయంతి వత్సరం. 1924 మే 23న శైవ మత ప్రచారమే వృత్తిగా కలిగిన ఆరాధ్య కుటుంబంలో భద్రయ్య, అన్నపూర్ణల జ్యేష్ఠ పుత్రునిగా జన్మించిన వీరయ్య ఆ బతుకు దారికి చేర్పుగా కవిగా సృజన నందిస్తూ సాగిపోయారు.

మొదట్లో పామరజన రంజకంగా 'తందనాన లింగలీలలు' రచించి పాడుతూ భక్తులను ఆకర్షించారు. 1955లో తన ఎరుకన వేములవాడ రాజరాజేశ్వరునిపై ఏ శతకం లేదని, ఆ లోటుకు భర్తీగా శ్రీ వేములవాడ రాజరాజేశ్వర శతక రచనకు ఉపక్రమించారు. బహు కుటుంబీకుడైన వీరయ్య తాను, తన వాళ్ల భారం భగవంతునిదే అని విశ్వసించి అదే మార్గంలో చివరివరకు గడిపారు. తన స్వస్థలం నిర్మల్‌లో శ్రావణ, కార్తీక మాసాల్లో పురాణాలు చెప్పేవారు. భజన గీతాలను అల్లుతూ ఆలపించేవారు. ఏ క్షేత్రాలను దర్శించినా ఆయా క్షేత్ర మహాత్మ్యాలను కీర్తించడానికి, నోములు, పండుగలు, ఉత్సవాలకూ భక్తిగీతాలు, మంగళ హారతులూ రచించారు.

జ్యోతిష్య శాస్త్రాన్ని స్వయంకృషితో అభ్యసించి సంప్రదించినవారికి జీవిత మార్గదర్శనం చేసేవారు. షష్ఠిపూర్తి తర్వాత పరమేశ్వర సాన్నిధ్యాన్ని కాంక్షించి, పళ్లూ, పాలు మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ... కాశీక్షేత్ర గర్భవాసంగా తొమ్మిది మాసాలు భార్య గంగమ్మతో సహా గడిపారు. ఈ సందర్భంగా ఉత్పల, చంపకాలతో శ్రీకాశీ విశ్వనాయక శతక రచన చేశారు. చివరి గడియ వరకు శివభజన, ఆ తోవన సృజననే తన వ్యాపకాలుగా కవి వీరయ్య జీవితాన్ని శివాంకితంగా గడిపారు.

శ్రీ వేములవాడ రాజరాజేశ్వర శతక రచనా ధోరణి: ఇంద్రునిచేత ప్రతిష్ఠితంగా విశ్వసించే వేములవాడ రాజరాజేశ్వరుని గురించి 'వాసవాశ్రిత వేములవాడ వాస! శ్రీశ సన్నుత! రాజేశ! చిద్విలాస!!' అన్న ద్విపాద మకుటంతో సీసపద్యాలలో 30 ఏండ్ల ప్రాయంలో వీరయ్య శ్రీ వేములవాడ రాజరాజేశ్వర శతకం రచించారు. పామర జనరంజకంగా సాగిన ఈ శతకంలో పూర్వ శతక కవుల ధోరణి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 18వ శతాబ్దపు ధర్మపురి శేషప్ప కవి పద్యాల ప్రభావం ఈ శతకంపై ఎంతో ఉన్నది. శేషప్ప కవి పద్యాలు అప్పటికే ప్రజల్లో ఎంతో పరివ్యాప్తమైనందున, సామాన్య జనులకు భక్తి, ముక్తులతో కూడిన సూక్తులనందించడమే తన ధ్యేయంగా వీరయ్య ఆ తోవనే తన శతక రచన కొనసాగించారు.

'నరసింహ నీ దివ్య నామ మంత్రము చేత..' అన్న శేషప్ప కవిలా 'రాజేశ నీ మంత్రరాజ జపంబున' అంటూ మంత్ర ప్రభావాన్ని పాదపాదాన ప్రస్తుతించారు. 'పసరంబు జడ్డైన పశుపాలకుని తప్పు' అన్న శేషప్ప కవి తోవనే 'పశువు ద్రిమ్మరియైన పశుపాలకుని తప్పు' అంటూ పద్యాన్ని నడిపారు. చాలా ప్రసిద్ధమైన శేషప్ప కవి 'లక్షాధికారైన లవణమన్నమెగాని మెరుగు బంగారమ్ము మింగబోడు' అన్న పద్యోక్తిని 'కోటీశ్వరుండైన కూడుగుడ్చునె కాని కనకంబు నెన్నడు తినడుయుర్వి!' అంటూ అనుసరించారు. 'దాసిన చుట్టా మా శబరి? దాని దయామతి నేలినావు; నీ దాసుని దాసుడా? గుహుడు తావకదాస్యమొసంగినావు' అంటూ రామదాసు రాయగా, వీరయ్య కవి 'బాణాసురుని కోట బంటువై గాచిన బత్తెమేమిచ్చెనో భర్గ! నీకు' అంటూ తన ఆర్తిని ప్రకటించారు. కవి వీరయ్య పూర్వ శతక కవులను అనుకరించడమే కాకుండా తనదైన మార్గంలోను ఈ శతకాన్ని నడిపారు. శివుని 25 లీలలు, వేములవాడ క్షేత్ర మహిమ, ద్వాదశ జ్యోతిర్లింగ వర్ణనల సందర్భాల్లో కవి ప్రత్యేకత ప్రస్ఫుటమవుతున్నది.శివుని మహా నాట్యలీలను వర్ణిస్తూ..

'శౌరి మృదంగంబు స్రష్టయు తాళంబు
పద్మజ ఢక్కయు వాణీవీణ' అంటూ ఆ నాట్య సన్నివేశాన్ని కండ్లముందు సాక్షాత్కరింపజేశారు. వేములవాడలో కోడెమొక్కు, గంట కట్టడం మొదలైన భక్తుల నమ్మకాలను కవి పద్యంలో ఇలా తెలిపారు.


'విశ్వేశ నీపేర వృషభ వత్సము నిడ
పుత్ర పుత్రికలను పొందగలరు!
మాహేశ నీగర్భ మంటపంబున ఘంట
గట్టగ వాగరి గలుగునయ్య!' కవి వీరయ్య భక్తి గీతాలు, మంగళ హారతులు ఏవైనా ధారాశుద్ధి కలిగి చెవుల్లో అమృతం పోస్తున్నంత హాయిగా ఉంటాయి.

'గౌరీసుత! గణపతి మత్కృత కలుషంబుల
నెడబాపుమురా!
వారణముఖ! భవకాననసీమను బాయు
నుపాయము తెలుపుమురా!!' అని గణేశ నవ రాత్రి ఉత్సవాలలో రాశారు.

'శ్రీ సరస్వతీ! శివకరి! సురనర వందిత! శ్రీ సరస్వతీ!
వ్యాసపుర నివాసిని! భవపాశంబిల బాయగ, నీ ధ్యాన జేతు నిరతము, నా దోషంబుల బాపుమంబ! శ్రీ సరస్వతీ!'
ఇది బాసర క్షేత్రంలో రాసిన గీతం.

'హారతిదే గైకొనుమా అంబా! భవానీ! హరురాణి- ఆరాధింతును నీ చరణములన్ ఆలకింపుమా మొర సత్కరుణన్..
స్మరహరణా స్థిర కరుణా! హర శివ హారతి గైకొనరా' అంటూ కవి వీరయ్య సందర్భశుద్ధిగా రాసిన ఎన్నో గీతాలు, హారతులలో మచ్చుకు కొన్ని పాదాలివి.

'ఉ.పుట్టితి తల్లిగర్భమున పున్నెము పాపము లెన్నొ జేసితిన్
గట్టున జేర్తువో కృపను, గంగను ముంతువొ నీదు భారమౌ
పట్టితి నీదునామమున భక్తి జపించుచు వారణాసిలో
గట్టిగ కాయమున్ విడుచు కాంక్షను దీర్చవె విశ్వనాయకా!' అంటూ కవి ఈ శతకంలో మోక్ష కాంక్షనే పరమావధిగా వెలిబుచ్చాడు. అంతా, అన్నింటికీ సర్వేశ్వరుడన్న జ్ఞాన నేత్రం తెరచుకున్న వాడై నిత్య పూజలతో ఆ స్వామినే కొలుస్తూ, తలుస్తూ 2008, ఏప్రిల్ 23న శివైక్యమయ్యారు.





మడిపల్లి రాజ్‌కుమార్
99496 99215

## మా(యా)లోకం..

అమాయకత్వం అడుగుతోంది..
'మోసమా.. మోసమా.. నువ్వు ఎక్కడ ఉంటావ్'?
మోసం-మీసం మెలేసి చెప్పింది-
'నమ్మకం పక్కనే ఉంటాను'.. అని!
'అవునా'..? అమాయకత్వం.. అమాయకపు ప్రశ్న.
'నమ్మకం లేకపోతే ఎవర్నైనా నమ్మి చూడు'
నిమ్మళంగా చెప్పింది మోసం..
'ఎప్పటికైనా గ్రహిస్తుంది లోకం'..
చెప్పింది అమాయకం
'అందుకే నువ్వు వెర్రిమాలోకం'..
గట్టిగా నవ్వుతూ చెప్తోంది మోసం...



తరిగొప్పల వీఎల్లెన్ మూర్తి
80085 77834

## ఆహ్వానం

### శిక్షణ శిబిరం ప్రారంభోత్సవం

హైదరాబాద్‌లోని తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామభద్ర క్షేత్రంలో ఈ నెల 20న సోమవారం ఉదయం 10.30 గంటలకు అవధాన విద్యా వికాస పరిషత్ మూడో శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగనున్నది. మహాకవి డాక్టర్ మాడుగుల నాగఫణి శర్మ ముఖ్య అతిథిగా, అవధాన విద్యా వికాస పరిషత్ గౌరవాధ్యక్షులు డా.కేవీ రమణాచార్య సభాధ్యక్షులుగా, దూరదర్శన్ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు ఆత్మీయ అతిథిగా హాజరవుతారు. డాక్టర్ దోర్బల ప్రభాకరశర్మ, డాక్టర్ రంగాచార్య, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు అపర్ణ, కసిరెడ్డి వెంకటరెడ్డి, నల్లాన్ చక్రవర్తుల చక్రవర్తి, కంది శంకరయ్య, శ్రీరామ్ ఘనాపాటి, రఘుశర్మ శంకరమంచి, కొడవటిగంటి మహాదేవశర్మ తదితరులు పాల్గొంటారు.

- మరుమాముల దత్తాత్రేయ శర్మ
- కేవీఎన్ ఆచార్య

### పురస్కారం

సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ, వరంగల్లు ఆధ్వర్యంలో ఈ నెల 21న మంగళవారం నాడు సాయంత్రం 6 గంటలకు హన్మకొండలోని పీఆర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సహృదయానుబంధ పురస్కార సభ-2024 (కీ.శే రాళ్లబండి కవితా ప్రసాద్ స్మారక పురస్కారం) జరుగనున్నది. ప్రసార భారతి పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావుకు ఈ కార్యక్రమంలో పురస్కారం అందజేస్తారు. భారత చరిత్ర పరిశోధన పరిషత్ పూర్వ అధ్యక్షులు ఆచార్య యల్లాప్రగడ సుదర్శన్‌రావు ముఖ్య అతిథిగా హాజరవుతారు. డాక్టర్ ఎన్వీఎన్ చారి, కుందావఝ్ఝుల కృష్ణమూర్తి కవితా ప్రసాద్ కవిత్వ పఠనం చేస్తారు. అందరూ ఆహ్వానితులే.

- జి.గిరిజామనోహరబాబు
- కుందావఝ్ఝుల కృష్ణమూర్తి

**2024, మే 6.. సోమవారం రోజున 'చెలిమె'లో 'మాట్లాడే వెన్నెముక విశ్వనాథ' అనే శీర్షికన విశ్వనాథ సత్యనారాయణ గురించి కేతవరపు రాజ్యశ్రీ కొన్ని మంచి విషయాలను చెప్పారు. 'అవార్డు ఇవ్వడం కంటే మిరపకాయల ధర తగ్గిస్తే సంతోషపడేవాడిని' వంటి చమక్కులను గుర్తుచేశారు.**

# కిన్నెరసాని ద్రాక్షాపాకమే!



తెలుగు సాహిత్యానికి విశ్వనాథ వారికి విడదీయరాని సంబంధం ఉన్నది. తెలుగు సాహిత్యాన్ని తొలిసారిగా జ్ఞానపీఠం ఎక్కించిన ఘనత విశ్వనాథ సత్యనారాయణది. సాహిత్య ప్రియులు విశ్వనాథ సాహిత్యమనగానే 'అబ్బా...' అనుకోవడం ఎంత సహజమో.. 'విశ్వనాథ సాహిత్యం చదువడం మొదలు పెట్టాడా? ఆహా...' అనుకోవడం కూడా అంతే సహజం.

విశ్వనాథ మాట్లాడే వెన్నెముక.. పాట పాడే సుషుమ్న అని రాజ్యశ్రీ అన్నారు. సుషుమ్నా నాడిని పక్కనపెడితే, విశ్వనాథ రాసిన కిన్నెరసాని పాటలలో కిన్నెరసాని పరికిణీ తొక్కాడు పదేండ్ల కన్యలా సాగిందంటారు. ఇది పల్లె పడుచుల చక్కని అలంకరణ. పదేండ్ల పాప తను ధరించిన పరికిణీని కొంచెం ఎత్తి పట్టి వడివడిగా నడుస్తుంటే, పరికిణీ చివరలు అప్పుడప్పుడు పాదాల కింద పడుతుంటే... ఆ దృశ్యం పల్లె తల్లి హృదయాన్ని గిలిగింతలు పెడుతుంది. ఇది అందరికీ అర్థమయ్యే అతి చక్కని భావన. ఇలాంటి భావనలు బ్రహ్మానందాన్నే కలిగిస్తాయి. విశ్వనాథ అనగానే కొరుకుడుపడని భాషా ప్రయోగశీలి అని ఎక్కువమంది అనుకుంటారు. విశ్వనాథ కిన్నెరసాని పాటలు వంటి పుస్తకాలు చదువుతుంటే అసలు ఈ ఆలోచన రాదు. ద్రాక్ష పాకంలా అలా అలా సాగిపోతుంది. విశ్వనాథ భారతి పత్రికలో రాసిన నన్నయ్య అక్షర రమ్యత, నన్నయ్య ప్రసన్న కథాకలితార్థయుక్తి, నానారుచిరార్థ సూక్తి నిధిత్వం వంటి వ్యాసాలు చదువరులను మరో లోకానికి తీసుకువెళ్తాయి. మహా భారతాన్ని మరో మంచి కొత్త కోణంలో ఆలోచింపజేస్తాయి.

విశ్వనాథ వారు తమ బాణావతి నవలలో 'ధాతూనాం అనేకార్థాత్' అంటూ చేసేవాదన విజ్ఞాన చర్చ ఎలా ఉండాలో చెప్తుంది. విజ్ఞాన మూలాలను ఎలా చూడాలో చెప్తుంది. హితాన్ని కోరేది సాహిత్యం. అయితే సాహిత్య సృష్టికర్త ఆలోచనా ధోరణిని అనుసరించి హితం అహితం అనే అంశాలు కొన్ని ఉంటాయి. కొందరికి సంప్రదాయం హితమైతే మరి కొందరికి అభ్యుదయం హితంగా కనపడుతుంది. తప్పు లేదు. ప్రజలకు అనారోగ్యం కలిగించనిదేదైనా స్వీకరణీయమే. మన వేద పురాణేతిహాసాలలో మంత్రాలను, భక్తిని చూసేవారు కొందరుంటే కథలను చూసేవారు మరికొందరుంటారు. ఆధ్యాత్మిక ప్రపంచాన్ని చూసేవారు ఇంకొందరుంటారు. ఇంకా గట్టిగా చెప్పాలంటే ఇవి చూసేవారే ఎక్కువ. అయితే విజ్ఞానాత్మక విషయాలను చూసేవారు కూడా కొందరుంటారు. సమాజంలోకి ఇంకా అడుగుపెట్టని విజ్ఞానాత్మక విషయాలను చూడటం తప్పు కాదు కదా? సమాజంలో అడుగుపెట్టిన విజ్ఞానాత్మక విషయాలు మా పురాణాల్లో ఉన్నాయనడమే హాస్యాస్పదమవుతుంది. ఏ విజ్ఞాన విషయాలైనా ప్రయోగశాలలో విజయం సాధించాల్సి ఉంటుంది. ప్రయోగశాలలో విజయం సాధించే భావనలు సదా ఉపయోగకరమే కదా?

> **కవిత్వంలో ఛాందసం, అభ్యుదయం, పురోగమనం, తిరోగమనం కాలమాన పరిస్థితులను బట్టి మారుతుంటాయి. ఒకప్పుడు కవిత్వంలో సంప్రదాయం ఉంటే నేడు అభ్యుదయం ఉంటుంది. ఇది ఎవరికి ఎంతవరకు ఉపయోగపడుతుంది? అనేది లక్ష డాలర్ల ప్రశ్న. ఛాందసవాదులు కొందరు జీవితంలో ఎలా పైకి రావడం లేదో అభ్యుదయవాదులు కొందరు తాము మోసపోతున్నామని తెలిసీ ఏం చెయ్యలేక కంటినీటిని కంట్లోనే కుక్కుకుంటున్నారు. వాస్తవాలు వేరు. వాదాలు వేరు. నిజం చెప్పాలంటే వాస్తవవాదం ఉన్న కవిత్వమే నిజమైన కవిత్వం. అది విశ్వనాథ కవిత్వంలో కొంత ఉందన్నది కాదనలేని సత్యం.**

విశ్వనాథ వారి 'వేయిపడగలు' నవల అనగానే అందరికీ ధర్మారావు గుర్తుకు వస్తాడు. అతను నవలలో నాయకుడు కాబట్టి అతనే గుర్తుకురావడం సహజం. అయితే వేయిపడగలు నవలలో ఉన్న పసరిక పాత్ర చిత్రణ అనేక ప్రాకృతిక ధర్మాలను, విజ్ఞాన ఛాయలను సంతరించుకొని ఉంటుంది. దానితో పాటు పల్లెటూరి పొలాలు, అక్కడి సంస్కృతి మారుతున్న మానవ విలువలు అక్కడ కనపడుతాయి. వేయి పడగల నాగరాజు అంశ ఛాయామాత్రంగా పసరికలోనే కనపడుతుంది. ఏ కవి సృష్టించిన సాహిత్యమైనా సంపూర్ణంగా సమాజానికి ఉపయోగపడదు. ఎవరికి నచ్చిన అంశాన్ని వారు తీసుకుంటారు. కాలం మారింది. మారుతుంది. నేడు విజ్ఞాన విషయాలకు అగ్రపీఠం దక్కుతుంది. అంతమాత్రాన విశ్వనాథ భావజాలం ఇప్పుడసలు పనికిరాదనడం పొరపాటు. సంప్రదాయ విజ్ఞానపథాన వేయి పడగల విశ్వనాథ సదా గుర్తుంచుకోదగిన కవి సామ్రాట్. అలాంటి విశ్వనాథవారిని మరొకసారి గుర్తుచేసినందుకు కేతవరపు రాజ్యశ్రీకి ప్రత్యేక ధన్యవాదాలు.



వాగుమూడి లక్ష్మీరాఘవరావు
98494 48947